క్లుప్తంగా

డీటీఏఓ గణేష్‌కు సత్కారం


గణేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా డీటీఏఓగా పని చేసి ఇటీవల పదోన్నతిపై తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయిన ఎ.గణేష్ సేవలు వెలకట్టలేనివని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్ అన్నారు. పదోన్నతిపై వెళ్తున్న గణేష్‌ను ఆదివారం కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలకొల్లు యూనిట్ ప్రధాన కార్యదర్శి పీఎస్ ప్రతాప్‌రాజు, కోశాధికారి కేవీ కృష్ణయ్య, భీమవరం యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏయూ భాస్కరరావు, కోమల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు మార్గదర్శకులుగా ఉండాలని విద్యార్థులు ఏ రంగంలో రాణిస్తారో ముందుగా తెలియజేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల, పాఠశాలల్లోని 18 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, యిర్రింకి సూర్యారావు, వబిలిశెట్టి రామకృష్ణ, భూపతిరాజు బుజ్జిరాజు, విజ్జురోతి రాఘవులు తదితరలు పాల్గొన్నారు.

పేద కార్మికుడికి ఆర్థిక సాయం


కార్మికుడికి ఆర్థిక సాయం చేస్తున్న పాలకొల్లు వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని బంగారు వారి చెరువు ప్రాంతానికి చెందిన చోడవరపు రాము ఫ్లాట్ రిక్షా నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఒక షాపు వద్ద బరువైన ఇనుప రేకు కాలిమీద పడడంతో తీవ్రంగా గాయపడి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. డాక్టర్ల సూచన మేరకు మంచానికి పరిమితం అయ్యాడు. ఒక పాత్రికేయుడి ద్వారా రాము కుటుంబ పరిస్థితి తెలుసుకున్న పాలకొల్లు వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం రూ.10 వేలు సమకూర్చి క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, సభ్యుల చేతుల మీదుగా అతని ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, క్లబ్ సభ్యులు సోమంచి శ్రీనివాసశాస్త్రి, జంపన నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎంవీవీ రాఘవేంద్రరెడ్డి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎంవీవీ రాఘవేంద్రరెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. కొత్త కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కొత్త వీర్రాజు, ముఖ్యసలహాదారుగా పులిమి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా కోరిసిక శ్రీనివాసరావు, సెక్రటరీ ఆమంచి నాని, సంయుక్త కార్యదర్శులుగా కోరసిక నాగరాజు, టి.బాలాజీ, కోశాధికారిగా వీవీఎన్ సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలుగా ప్రసన్న, సెక్రటరీగా చింతాడ పద్మ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఇంటికే ఉచిత వైద్యసేవలు


తణుకులో వృద్ధుడికి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రామకృష్ణ

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ వైద్యసేవలందించారు. ప్రత్యేక వాహనం ద్వారా తణుకు, పైడిపర్రు, మండపాక ప్రాంతాల్లోని 6 గురు రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. అక్కిన కాశీ విశ్వనాథం ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైనవారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా నీడతో భద్రతకు భరోసా

ఇళ్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలంటున్న పోలీసులు


సీసీ కెమెరా


ఇళ్లకు, మార్గంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పాలకోడేరు: నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో నేరస్తులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు, పోలీసులకు దొరకకుండా తెలివిగా నేరాలు చేస్తున్నారు. ముఖ్యంగా బంగారం ధరలు భారీగా పెరగడంతో చాలా మంది చోరులుగా మారుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా వృద్ధి చెందుతున్నందున భద్రత కోసం కచ్చితంగా ఇళ్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. జనాభా పెరుగుదలతో పాటు పట్టణాలు విస్తరిస్తుండడంతో భద్రతా అంశంలో పోలీసులతో పాటు ప్రజలు కూడా తమ సహకారాన్ని అందించాలని పోలీసు శాఖ సూచిస్తుంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అందులో భాగంగా ఇళ్ల వద్ద దుకాణాల వద్ద అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తుంది. విజిబుల్ పోలిసింగ్‌తో చోరీలు నేరాలకు పాల్పడే వారిని త్వరితగతిన పట్టుకునేందుకు వీలుంటుందని తద్వారా నేరలను అదుపు చేయవచ్చని పోలీసులు చెబుతున్నారు.

ఎలాంటి సీసీ కెమెరాలు వాడాలంటే?

ఏదో పెట్టుకున్నామనుకునే పేరుకు ఏదో ఒక సీసీ కెమెరాను ఇళ్లకు, దుకాణాలకు అమర్చడంలో ప్రయోజనం ఉండదని పోలీసులను హెచ్చరిస్తున్నారు. బయటి వైపు ఉంచే కెమెరాల్లో టీపో క్రిస్టల్ క్లియర్ 2కే క్యూ హెచ్‌డీ పరిజ్ఞానం ఉన్న స్మార్ట్ హోమ్ సెక్యూరిటీ కెమెరాలు అమర్చుకోవాలని సూచిస్తున్నారు. ఈ కెమెరాల్లో నైట్ విజన్, మోషన్ డిటక్షన్, టూవే ఆడియో స్టోరేజ్ ఆప్షన్, ఎలక్ట్రానిక్ పాస్ సౌకర్యలు ఉంటాయి. దీంతో నేరస్తులను సులభంగా పట్టుకోవచ్చు. అలాగే లోపల వైపు ఉంచే కెమెరాల్లో పాస్ సెక్యూరిటీ వైఫై స్మార్ట్ పరిజ్ఞానం గానీ, 4జీ సిమ్ ఆధారంగా వైఫైతో పని చేసే 3 ఎంపీ స్మార్ట్ కెమెట్ హెబ్రిడ్ పరిజ్ఞానం గాని ఉండాలి. ఈ కెమెరాల్లో పాన్ ఫీచర్ హైరిజుల్యూషన్ వైఫై కనెక్టివిటి నైట్ విజన్ టూవే ఆడియో ఉంటుంది. ఇవి దుకాణాలకు ఉపయోగపడుతుంది ఊరికి దూరంగా వైఫై సదుపాయం లేని ఇళ్లకు సోలార్ 4జీ సిమ్ 4ఎంపీ పాన్ టిల్ట్ జూమ్ సదుపాయం ఉన్న సీసీ కెమెరాలు వాడాలి. ఇది సిమ్ సపోర్ట్ తో పని చేస్తుంది. అలాగే వాటర్ ప్రూఫ్ సౌకర్యం కూడా ఉంటుంది రికార్డింగ్ చేసే అంశాలు స్పష్టంగా ఉంటాయి.

నేర నియంత్రణలో కీలకం

అనుమానితులు, నేరస్తులను గుర్తించడంలో సాక్ష్యాలను సేకరించడలో సీసీ కెమెరాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. కెమెరాల ద్వారా పొందిన సాక్ష్యాలను న్యాయ ప్రక్రియలో కీలకంగా ఉంటాయి. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించడంలోనూ పట్టణ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించడంలో ఎంతో సహాయ పడతాయి.

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా



సీసీ కెమెరాలు ప్రజలు భద్రత లో ఒక భాగమే అని గుర్తించి ప్రజలు సహకారం అందించాలి. ఇప్పటికే భద్రత లో భాగంగా డయల్ 100, 112, వాట్సాప్ నెంబర్, ఎల్‌హెచ్ఎంఎస్ లు వాడుకలో ఉన్నాయి. పాలకోడేరుతో సహా మిగతా మూడు మండలాల్లో గుర్తించిన కొన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. పటిష్ట భద్రత కోసం కొంత ఖర్చు చేసినా దాని ప్రయోజనం ఎంతో ఉంటుందని ఇళ్ల యజమానులు, దుకాణా యజమానులు, పరిశ్రమల యజమానులు తెలుసుకోవాలి.

– బి.శ్రీనివాసరావు, సీఐ భీమవరం రూరల్

ఈపీఎఫ్‌లో ఘనంగా యూత్ సమావేశం

పెంటపాడు: యువత బైబిలు వాక్యసారంగా ఆధ్యాత్మిక జీవ నం సాగించాలని, తద్వారా యూత్ విశ్వాసులు ఆధ్యాత్మిక స్నేహభావంగా మెలగాలని ఈపీఎఫ్ సంఘ పాస్టర్ పి.మోజెస్‌ప్రవీణ్ పేర్కొన్నారు. తణుకు ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో అక్టోబర్ నెల మొదటి ఆదివారం పురస్కరించుకొని యూత్ సమావేశం నిర్వహించారు. సంఘ వ్యవస్థాపకురాలు పి. అరుణకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన అనంతరం పాస్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రైస్తవ యువత తోటివారికి మార్గదర్శిగా ఉండాలన్నారు. సేవకురాలు ప్రైజీ ప్రవీణ్ ఆధ్యాత్మిక సందేశం అందించారు. అనంత రం భక్తులకు ప్రేమవిందు ఏర్పాటు చేశా రు. సాయంత్రం ఉండ్రాజవరం గ్రామంలో నూతన మందిర ప్రతి ష్ట ఆరాదన సేవకులు, విశ్వాసుల ఆధర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

చెస్‌లో విద్యార్థి ప్రతిభ


కప్ అందుకున్న బాల సాయి కార్తీక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఇటీవల విజయవాడలోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన వంగపండు బాల సాయి కార్తీక్ అండర్–12 ఓపెన్‌లో 4.5/6 పాయింట్లు సాధించి మూడోవ స్థానంలో నిలిచాడు. కప్, మెడల్, సర్టిఫికెట్‌లు అందుకున్నారు. విజేతకు కోచ్ ప్రదీప్, పట్టణ ప్రముఖులు పలువురు అభినందనలు తెలిపారు.

గ్రామోత్సవాలతో ముగిసిన దసరా సందడి


ఆకివీడు: పెద్దింటి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం


కాళ్ల: జువ్వలపాలెంలో గ్రామోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు


కాళ్ల: వెంకటాపురంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో వైభవంగా ముగిశాయి. చాలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్ల విగ్రహాలను ఆదివారం ఊరేగించి నిమజ్జనం చేశారు. మండలంలోని జువ్వలపాలెంలో ఉన్న కనకదుర్గమ్మ, వెంకమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ఊరేగించి నిమజ్జనం చేశారు. విచిత్ర వేషధారణలు, తీన్మార్ వాయిద్యాలు, బాణకాల్చుల నడుమ అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా జరిపారు.

వెంకటాపురంలో..

శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలతో పాటు అన్న సమారాధనలు నిర్వహిస్తున్న ట్రస్ట్ అధినేత దాట్ల రామరాజు అభినందనీయులని మాజీ ఎంపీపీ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు వెంకటాపురంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా దాట్ల శ్రీదేవి మోమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కాళ్లకూరు సొసైటీ అధ్యక్షుడు దండు ప్రణవ మూర్తిరాజు, దాట్ల సత్యనారాయణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, సాదు శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింటి అమ్మకు కుంభాభిషేకం

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక పెద్దింటి అమ్మవారికి కుంభం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖండ అన్నసమారాధనను ఆలయ చైర్మన్ గొంటా గణపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. అఖండ అన్నసమారాధనకు 2 వేల మందికి పైగా భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిమిడి అరుణ కుమారి, నాగరాజు, మోరా జ్యోతిరెడ్డి, కార్యనిర్వాహణాధికారి అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

రూ.1.19 లక్షలు పలికిన లడ్డూ

మండలంలోని చినకాపవరం శివారు మహాలక్ష్మీపురం గ్రామంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన లడ్డూను ఆదివారం వేలం వేశారు. 99 కేజీల లడ్డూనూ వేలంపాటలో గ్రామానికి చెందిన భూపతిరాజు రంగరాజు రూ.1.19లక్షలకు సొంతం చేసుకున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామంలోని అమ్మవారి లడ్డూ వేలం రూ.లక్ష దాటడం విశేషం.

బ్యాంక్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక బ్యాంక్ కాలనీలోని కోప కల్యాణ మండపంలో ఆదివారం కోప, విశ్వకాపు జాగృతి, హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కోప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం ఆప్తమాలజీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రాలజీ, ఆంకాలజీ, ఆర్థోపెడిక్ వంటి వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యిర్రింకి సూర్యారావు, మెంటే పార్థసారధి, కోపా ప్రెసిడెంట్ యర్రంశెట్టి హరినాథ్, విశ్వకాపు జాగృతి ప్రెసిడెంట్ అల్లం నాగేశ్వరరావు, యశోద హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ సారిక వెంకట్రావు, ఆరేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో తీరని నష్టం


పాందువ్వలో మాట్లాడుతున్న కేవీపీఎస్ మండల కార్యదర్శి మదాసి గోపి

ఉండి: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం దళితులకు తీరని నష్టం వాటిల్లుతుందని కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ ఆవేదన వ్యక్తం చేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) 27వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉండి మండలం పాందువ్వలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ పతాకాన్ని ఎగురవేసిన గోపి మాట్లాడుతూ నిరుపేదలు, బలహీనులకు అండగా ఉండి వారిని పోత్సహించాల్సిన ప్రభుత్వం ప్రైవేటీకరణ బాట పట్టడం బాధాకరమని మండిపడ్డారు. ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం వల్ల ఎంతో మంది పేదవారు ముఖ్యంగా దళితులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో అర్జున్, కాసులు, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ప్రశాంత్, వైస్‌రాజ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న గరికపాటి బాపయ్య శర్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్ గరికపాటి బాపయ్య శర్మ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. వి లవ్ రీడింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ 1966 నుంచి యునెస్కో సూచనలు మేరకు ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయల గుర్తింపు, జీవన పరిస్థితులు, ప్రోత్సాహం, విద్యా ప్రమాణాలు పెంపు తదితర విషయాలను విద్యార్థులు, చదవరులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏవీ లక్ష్మణరావు, వి.జానుబాబు, సిబ్బంది, స్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రోడ్ల అభివృద్ధి ఎప్పుడో?

పట్టణంలో అధ్వానంగా పాత సిమెంట్ రోడ్లు


చినమామడిపల్లి 31వ వార్డులో శిథిలావస్థకు చేరిన కాలువగట్టు సీసీ రోడ్డు

నరసాపురం: పట్టణంలో పాత సిమెంట్ రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పలు ప్రాంతాల్లో రోడ్ల మధ్యలో ఖాళీలు ఏర్పడడం, రోడ్లు గుంతలు పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల అభివృద్ధిపై అటు మునిసిపల్ అధికారులు గానీ ఇటు ప్రజాప్రతినిధులు గానీ దృష్టి పెట్టకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. గడిచిన ఏడాదిన్నరగా శిథిలమవుతున్న పాత సిమెంట్ రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణానికి మాత్రం రూపాయికూడా ఖర్చు చేయాలని మున్సిపాలిటీ నిర్ణయించకపోవడం గమనార్హం. దీనిపై పట్టణవాసుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతుంది.

పట్టణంలో రోడ్లు ఇలా

నరసాపురం పట్టణం 11.32 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో 60 వేల జనాభాతో, 31 వార్డులతో విస్తరించి ఉంది. పట్టణ పరిధిలో కేవలం 2 కిలోమీటర్లు మేర మాత్రమే ఆర్అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. మిగిలిన విస్తీర్ణంలోని రోడ్లన్నీ మునిసిపాలిటీకి చెందినవే ఉన్నాయి. మునిసిపల్ రోడ్లలో కూడా దాదాపుగా అన్నీ సిమెంట్ రోడ్లే. పట్టణంలో మొత్తం 68.37 కిలోమీటర్లు మేర పరిధిలో మునిసిపల్ రోడ్లు ఉన్నాయి. వీటిలో బీటీ రోడ్లు 15.65 కిలోమీటర్లు, కంకర రోడ్లు 7 కిలోమీటర్లు, కచ్చా రోడ్లు 2 కిలోమీటర్లు,ఇతర రహదారులు 10.37 కిలోమీటర్లు మేర ఉన్నాయి. అయితే అత్యధికంగా 31.52 కిలోమీటర్లు మేర సిమెంట్ రోడ్లు విస్తరించి ఉన్నాయి.

అధ్వానంగా సిమెంట్‌రహదారులు

పట్టణంలో సిమెంట్ రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. పుర పాలకులు, అధికారులు ఈ రోడ్ల పరిస్థితిపై దృష్టిపెట్టకపోవడంతో పరిస్థితి మరింత అధ్వాన స్థితికి చేరాయి. ఇటీవల కాలంలో ఈ రోడ్లకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో రోడ్లు గోతులు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గడ్డిబజార్, కనకదుర్గ టెంపుల్ స్ట్రీట్, రాయపేట, స్టేషన్‌పేట, గ్రేస్ నగర్, నందమూరి కాలనీ, చినమామిడిపల్లి, పొన్నపల్లి ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. అలాగే ఈ ప్రాంతంలో రోడ్లు కూడా బాగా శిథిలమయ్యాయి.

పుష్కర రోడ్లగా మిగిలిపోతున్న వైనం

2003 గోదావరి పుష్కరాల్లో భారీగా నిధులు రావడంతో పట్టణంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం ఎక్కువగా జరిగింది. 2015 గోదావరి పుష్కరాల్లో మళ్లీ కొన్ని చోట్ల రోడ్లను నిర్మించారు. కేవలం పుష్కరాలు సమయంలో మాత్రమే మున్సిపల్ రోడ్లు అభివృద్ధిపై దృష్టిపెడుతున్నారు. మధ్యలో రోడ్ల అభివృద్ధికి పైసా ఖర్చు చేయడం లేదు. దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మున్సిపల్ రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వాసవీమాతకు ఇరుముడుల సమర్పణ


వాసవీ శాంతి ధాంలో వాసవీ మాత సన్నిధిలో వాసవీ మాలధారులు


వాసవీ శాంతి ధాంలో హోమం చేస్తున్నబెంగళూరు భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో వాసవీ కన్యకపరమేశ్వరి వాసవీ మాలధారులు ఆదివారం ఇరుముడులు సమర్పించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం నుంచి వచ్చిన వాసవీ మాలధారులు ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం శాంతి హోమం నిర్వహించి అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మాలధారులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వాసవీ శాంతి ధాంలో బెంగుళూరు నుంచి వచ్చిన వాసవీ భక్తులు మరకత శిల వాసవీ మాతకు దంపతుల పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేసి అనంతరం వాసవీ శాంతి హోమం నిర్వహించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

భీమవరం: స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చినఅమిరం గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ ఎస్సై రహమాన్ ఆదివారం విలేకరులకు చెప్పారు. చినఅమిరం గ్రామంలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.47,630 స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రహమాన్ చెప్పారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని కోరారు.

పిడుగుపాటుతో గేదె మృతి

పాలకోడేరు: పిడుగుపాటుకు గురై గేదె మృతి చెందిన సంఘటన విస్సాకోడేరులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కారుమంచి ఎర్ర మునియా గేదెలు మేపుకుంటూ జీవం సాగిస్తున్నాడు. ఇటీవల రూ.1. 20 వేలు విలువైన పాడి గేదెను కొనుగోలు చేశాడు. ఆదివారం సోమరాజు చెరువు దగ్గర పాడి గేదె గడ్డి మేస్తుండగా ఒక్కసారిగా పిడుగుపడడతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు.

12 వరకు మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలు


తణుకులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సైకాలజిస్ట్ అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: మానసిక ఆరోగ్యం అవగాహన వారోత్సవాలు ఈ నెల 12 వరకు జాతీయవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ తెలిపారు. శనివారం మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ తణుకు బ్రాంచ్‌లో పీపీఎఐ జాతీయ సెక్రటరీ డాక్టర్ పి. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లకుపైగా ప్రజలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, ప్రతి ఏడుగురిలో ఒకరికి ఈ సమస్య ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని తెలిపారు. మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాలా మంది పక్క వారితో పోల్చుకోవడంతో మానసిక అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీపీఎఐ జాతీయ వైస్ ప్రెసిడెంట్ డా. వింజరపు జనార్ధనం, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డా.ఎంఎస్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా ప్రోగ్రాం అడ్వైజర్ డా. సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి, కోనసీమ జిల్లా అధ్యక్షుడు శ్రీమతి లలితాదేవి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.